## క్లుప్తంగా

### శాకంబరిగా కాశీ అన్నపూర్ణాదేవి

**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక రామేశ్వరంలోని హనుమత్ లింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి భక్తులు అభిషేకాలు చేశారు. కాశీ అన్నపూర్ణాదేవికి పంచామృతాభిషేకం, కుంకుమ అర్చన చేసి కూరగాయలతో శాకంబరిగాగా అలంకరించారు. భక్తులు అమ్మ వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

### లక్ష్మీనరసింహస్వామికి తైలాభిషేకం

**గోపవరం :** మండలంలోని వల్లెరవారిపల్లెలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నూగుల నూనెతో శనివారం తైలాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి నిజరూప అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

### వైభవంగా వీరభద్రస్వామి కళ్యాణం

**అట్లూరు :** మండలంలోని కొండూరులో వెలసిన వీరభద్రస్వామి ఆలయంలో స్వామి, అమ్మవారి కల్యాణం శనివారం వైభవంగా జరిగింది. ఆలయ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా ఉదయం గ్రామస్తులు స్వామికి అభిషేకాలు చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్లను వేదికపై ఆశీనులను చేసి కళ్యాణం జరిపించారు. మండల నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు దేవిరెడ్డి పెద్దనరసింహారెడ్డి అన్నదానం చేశారు.

### పేదలకు అన్నదానం

**ప్రొద్దుటూరు :** విద్యుత్ ఉద్యోగి ఎస్ఏఎస్ కామేశ్వరరావు వర్ధంతి సందర్భంగా స్థానిక పాత బస్టాండ్ వద్ద ప్రాణదాత సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం అన్నదానం చేశారు. విద్యుత్తు శాఖ యూనియన్ 1104 నాయకులు పరశురామ్, శివ, బర్నబాస్ ఈ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ప్రాణదాత సేవా సమితి చైర్మన్ సునీల్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణరెడ్డి, రాజు, సూర్యనారాయణ, ఈశ్వర్‌రెడ్డి, న్యాయవాది సుమంత్ కుమార్ పాల్గొన్నారు.

### దాతల దాతృత్వం

**కాశినాయన :** మండలంలోని బాలమ్మ సత్రంలోని వృద్ధులకు దాతలు శనివారం అన్నదానం ఏర్పాటుచేశారు. ఎస్టీయూ నాయకులు రమణారెడ్డి, సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ చంద్రహాసరెడ్డి, వెంకటరామిరెడ్డి తమ తల్లి తులశమ్మ జ్ఞాపకార్థం ఏటా సామాజిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. అనాథ వృద్ధులను చేరదీసిన బాలమ్మ సత్రం నిర్వాహకుల సేవాతత్పరత వెలకట్టలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు, ఎస్టీయూ నాయకులు రవికేశవ రావు, వాకాచంద్రశేఖర్, కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ముందస్తు క్రిస్మస్

**రాజుపాళెం :** మండలంలోని టంగుటూరు గ్రామంలోని సీఎస్ఐ చర్చిలో శనివారం రాత్రి ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ అలరించాయి. అనంతరం అన్నదాన చేశారు.

### అక్షర శిల్పి చెన్నారెడ్డి

**చాపాడు :** నేలతల్లిని నమ్ముకున్న రైతు కొడుకు తెలుగు ఉపాధ్యాయుడు బొగ్గుల చెన్నారెడ్డి అక్షరశిల్పి అని యోగివేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యుడు మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. మండలంలోని లక్ష్మీపేట జెడ్పీ పాఠశాలలో బొగ్గుల చెన్నారెడ్డి పదవీ విరమణ సభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో మంది విద్యార్థులను ఆదర్శంతంగా తీర్చిదిద్దిన ఘతన చెన్నారెడ్డిదే అన్నారు. అధికార భాషా సంఘం పూర్వ సభ్యులు తవ్వా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ విద్యార్థి, ఉపాధ్యాయుల మధ్య అనుబంధం గొప్ప సమాజాన్ని నిర్మించగలదన్నారు. అనంతరం బొగ్గుల చెన్నారెడ్డి దంపతులను అతిథులు, ఉపాధ్యాయులు పూలమాలలు, శాలువా కప్పి, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోండి



కేక్ కట్ చేస్తున్న మేనేజర్

**ఖాజీపేట :** బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ డాకాల అబ్బయ్య కోరారు. పుల్లూరు పరిధిలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ 11వ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. కేక్ కోసిన అనంతరం బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకులో బంగారం రుణాలను వేగంగా అందిస్తున్నామని, ఆ ఫలితంగా ఖాతాదారులు పెరిగారని అన్నారు. గృహ రుణం, ఇతర రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఖాతాదారులు బ్యాంకుకు సహకరించి రుణాలు చెల్లించాలన్నారు.

# ప్రశాంతతకు నిలయం.. సర్వజనుల ఆలయం

సగిలేరు ఒడ్డున నిర్మించిన తెలుగుగంగ అక్విడెక్ట్ కాలువ సమీపంలోని ఆ నిర్మాణం ఎవరినైనా ఆకట్టుకుంటుంది. దగ్గరికి వెళ్లి చూస్తే అక్కడి ప్రశాంతత ఔరా అనిపిస్తుంది. అపురూపమైన నిర్మాణ శైలి మనస్సుకు హత్తుకుంటుంది. ఆ నిలయమే కలసపాడులోని పరిశుద్ధ పరిపేతురు పరిపౌలు ఆలయం.

- ఆకట్టుకుంటున్న పరిశుద్ధ పరిపేతురు పరిపౌలు నిలయం
- 137 ఏళ్ల చరిత్ర కలిగినా చెక్కు చెదరని భవనం
- డిసెంబర్ 2, 3వ తేదీల్లో కలసపాడులో తిరుణాల



కలసపాడులోని పరిశుద్ధ పరిపేతురు పరిపౌలు ఆలయం



ఆకట్టుకునే చర్చి లోపలి భాగం

**కలసపాడు :** కలసపాడు సగిలేరు ఒడ్డున పరిశుద్ధ పరిపేతురు పరిపౌలు ఆలయం ఆధ్యాత్మిక నిలయంగా విరాజిల్లుతోంది. 136 ఏళ్లు పూర్తి చేసుకున్న ఈ భవనంలో డిసెంబర్ 2వ తేదీన ప్రతిష్ట మహోత్సవాలు జరుపుకొనేందుకు సిద్ధమవుతోంది. 1884లో ప్రార్థనలు చేసేందుకు ఇంగ్లాండ్‌కు చెందిన రెవ.అర్థర్ ఇన్‌మన్ ఆధ్వర్యంలో ఈ చర్చి నిర్మాణం ప్రారంభించారు. మూడేళ్లు కష్టపడి అద్భుత ఆలయంగా దీనిని తీర్చిదిద్దారు. 1887 డిసెంబర్, 3న నిర్మాణం పూర్తయింది. 136 ఏళ్లు పూర్తవడంతో ఈ ఏడాది డిసెంబరు 2, 3వ తేదీల్లో ప్రతిష్ట ఉత్సవం, గుడి తిరుణాల జరుపనున్నారు. జిల్లా నుంచే కాక ఇతర జిల్లాల నుంచి లక్షల మంది భక్తులు ఉత్సవాలకు తరలివస్తారు.

**ఆకట్టుకునే నిర్మాణం**

ఆలయ నిర్మాణంలో వాడిన ఇటుకలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. స్థానికంగా దొరికే బంక మట్టి, ఇసుక, సున్నం, బెల్లం, లక్షల సంఖ్యలో కోడిగుడ్లను కలిపి గానుగ తిప్పి తయారు చేసిన గచ్చుతో భవనం నిర్మించారు. నునుపుదనం కోసం పైపూతలో కూడా గుడ్ల మిశ్రమాన్ని ఉపయోగించారు. ఆధునికత ఉట్టిపడేలా టేకు, తాటి చెక్కలతో కిటికీలు, తలుపులు తయారు చేశారు. కేరళ పెంకుతో పైకప్పు నిర్మించడంతో ఆకట్టుకునేలా పటిష్టంగా తయారైంది.

**లక్షల్లో తరలిరానున్న భక్తులు**

ఏటా గుడి తిరుణాలకు లక్షల్లో భక్తులు తరలివస్తారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచే కాక కర్నూలు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలతో పాటు దక్షిణాది రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు. ప్రధాన కార్యక్రమమైన భోగి పండగకు కనీసం లక్ష మందికి పైగా భక్తులు హాజరవుతుంటారు. 3న ఉదయాన్నే భక్తులు తలనీలాలు సమర్పించి ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. స్వామికి భారీగా కానుకలు సమర్పించుకుంటారు. ఈ కార్యక్రమానికి వచ్చిన మిత్రులు, బంధువులకు విందులు ఇస్తారు.

**చేరుకోవడం ఇలా..**

గుడి తిరుణాలకు వచ్చే భక్తులు రైలులో అయితే ప్రకాశం జిల్లాలోని గిద్దలూరు నుంచి రావచ్చు. గిద్దలూరు నుంచి కలసపాడుకు 33 కిలోమీటర్లు బస్సు సౌకర్యం ఉంటుంది. కడప జిల్లా కేంద్రం వరకు రైలులో వచ్చి అక్కడి నుంచి 95 కిలోమీటర్లు దూరంలో ఉన్న కలసపాడుకు బస్సులో రావచ్చు. నెల్లూరు జిల్లా నుంచి వచ్చేవారు ఉదయగిరి, బద్వేల్, పోరుమామిళ్ల మీదుగా కలసపాడుకు చేరుకోవచ్చు. కర్నూలు జిల్లా నుంచి వచ్చేవారు నంద్యాల, గిద్దలూరు మీదుగా చేరుకోవచ్చు.

**ఆలయ ప్రత్యేకతలివీ..**

ఆలయంలో నిర్మించిన గంటగోపురం, బాప్టిజం తొట్టి ప్రత్యేకమైనవిగా చెప్పవచ్చు. చర్చి లోపల ముఖద్వారం వద్ద ఈ తొట్టి ఉంది. ఆలయంలోకి వచ్చే భక్తులు ఆ నీటిని చల్లుకుని బాప్టిజం పొందుతారు. సుదూర ప్రాంతాల నుంచి తమ పిల్లలకు బాప్టిజం ఇప్పించేందుకు భక్తులు ప్రతిష్టా మహోత్సవాలకు తరలివస్తారు. గుడి వెలుపల ఏర్పాటుచేసిన గంటను గడియారం లేని రోజుల్లో సమయాన్ని తెలిపేందుకు అక్కడి గంట మోగించేవారు. 40 అడుగుల ఎత్తులో నిర్మించిన ఈ గంట ఆనాటి నుంచి భక్తులను ఆకట్టుకుంటోంది.

### సమస్యలు పరిష్కరించాలి

**పోరుమామిళ్ల :** మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, ఆయాల వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ మండల అధ్యక్ష కార్యదర్శులు సఫా, పీరయ్య, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు రేణుకమ్మ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విలేకరులతో శనివారం వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో భోజన కార్మికులకు రూ.10వేలు, స్వీపర్లు, ఆయాలకు రూ.11 వేలకు వేతనం పెంచుతామని ఇచ్చిన హామీ మరచారన్నారు. డిసెంబర్ 2న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాలో కార్మికులందరూ పాల్గొనాలని కోరారు.

### సీపీఎం మండల కార్యదర్శిగా భైరవప్రసాద్



**పోరుమామిళ్ల :** సీపీఎం మండల కార్యదర్శిగా భైరవప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు మనోహర్, రామ్మోహన్ నేతృత్వంలో తొమ్మిది మంది సభ్యులతో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. సభ్యులుగా గౌసియాబేగం, శ్రీనివాసులు, సుందరయ్య, బీబీ, వరలక్ష్మి, లూర్దుమేరి, ఓబులమ్మ, ప్రసాద్‌లు ఎన్నికయ్యారు.

## విదేశీ విద్యపై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులకు విదేశీ విద్య గురించి అవగాహన కల్పిస్తున్న భూపేంద్ర

**ప్రొద్దుటూరు కల్చరల్ :** విదేశీ విద్యపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని అబాకస్ ఓవర్‌సీస్ ఎడ్యుకేషన్ అడ్వైజర్స్ డైరెక్టర్ భూపేంద్ర తెలిపారు. ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌వీఎస్ రామసుబ్బమ్మ ప్రైడ్‌లోని అబాకస్ కార్యాలయంలో ఆదివారం విదేశీ విద్యపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేంద్ర మాట్లాడుతూ ఏపీ యూనివర్సిటీల్లో ఏఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయి, ఎవీ, వీసా ప్రాసెస్, విద్యకోసం లోన్ వంటి అంశాలను వివరించారు. అమెరికా, యూకే, ఆస్ట్రేలియా వంటి దేశాల్లోని యూనివర్సిటీల్లో మంచి కోర్సులు అందుబాటులో ఉన్నాయని, అక్కడ చదివితే మంచి అవకాశాలు లభిస్తాయన్నారు. పోస్టు స్టడీ వర్కు వీసా ద్వారా రెండు మూడు సంవత్సరాలు పని చేసుకోవచ్చన్నారు. అనంతరం విద్యార్థుల సందేహాలకు ఆయన సమాధానం చెప్పారు. అమెరికాకు చెందిన భారత దేశ ప్రతినిధి ప్రవీణ్, అబాకస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పార్కింగ్ ప్రదేశాలను గుర్తించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

**ప్రొద్దుటూరు క్రైం :** పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పార్కింగ్ ప్రదేశాలను గుర్తించాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. పోలీసు, మున్సిపల్, ఆర్అండ్‌బీ, ఆర్టీసీ అధికారులతో శనివారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్షించారు. గాంధీ రోడ్డులో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. హోమస్ పేట, టీబీ రోడ్డులలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. హోమస్ పేటలో సెంట్రల్ పార్కింగ్ తీసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని పేర్కొన్నారు. టీబీ బంగ్లాలో సెల్లార్‌ను, సుధా హాల్ ఎదురుగా ఉన్న మడూరు కాలువను పార్కింగ్ ప్రదేశాలుగా ఉపయోగించు కోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఆర్టీసీ డీఎం మల్లికార్జునరెడ్డి, డీఎస్పీ భక్తవత్సలం, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఐవీ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

**మైదుకూరు :** హెచ్ఐవీ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రిన్సిపల్ ఎస్‌బీ.సురేష్ బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రవి కళ్యాణ్ పేర్కొన్నారు. డిసెంబర్ 1న ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మైదుకూరులోని ఎస్‌బీఎస్‌వైఎం డిగ్రీ కళాశాలలో శనివారం ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితుల్ని కాదు.. వ్యాధిని ద్వేషించాలన్నారు. హెచ్ఐవీ నివారణకు ముందు జాగ్రత్తలేగానీ చికిత్స లేదన్నారు. హెచ్ఐవీ నిర్మూలనకు కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ బాషా, వేణుగోపాల్ నాయక్, గంగులయ్య, విజయ్, శేఖర్, దస్తగిరి, ప్రసాద్ రెడ్డి, సురేంద్ర పాల్గొన్నారు.

## నేడు అయ్యప్పస్వామి లక్షార్చన మహోత్సవం



విద్యుద్దీపాలంకరణలో అయ్యప్పస్వామి ఆలయం

**ప్రొద్దుటూరు కల్చరల్:** పెన్నానది తీరంలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం లక్షార్చన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు కొవ్వూరు రమేష్‌రెడ్డి తెలిపారు..ఈ సందర్భంగా ఆలయాన్ని పూలు, విద్యుద్దీపాలతో అలంకరించారని, లక్షార్చన పూజ ఉదయం 9.00 గంటలకు ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి 30 వేల మంది భక్తులు హాజరవుతారని అంచనావేసి అన్న ప్రసాదం ఏర్పాటుచేశామన్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా 13 కౌంటర్లు ఏర్పాటుచేశారు. 500 మందికి పైగా ఆర్‌సీపీఈ, ఆర్టీటీ విద్యార్థులు, అయ్యప్ప దీక్షదారులు, భక్తులు, వాలంటీర్లు సేవలందిస్తున్నారు.

## మండల నిధుల వివరాలు చెప్పండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ భాస్కర్‌బాబు

**అట్లూరు :** మండలానికి కేటాయించిన నిధుల వివరాలు చెప్పాలని మండల ఉపాధ్యక్షుడు ఆర్.సుబ్బారెడ్డి ప్రశ్నించారు. అట్లూరు స్త్రీశక్తి భవనంలో ఎంపీడీఓ భాస్కర్‌బాబు అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా శాఖల వారీగా అధికారులు తమ పరిధిలో జరుగుతున్న పనుల వివరాలు తెలిపారు. తమ ఎంపీటీసీ పరిధిలో ఏ పనులకు ఎంత నిధులు కేటాయించారో.. చెప్పాలని సభ్యులు కోరారు. ఎంపీడీఓ భాస్కర్‌బాబు మాట్లాడుతూ అవసరమైన పనులను ప్రతిపాదిస్తే వెంటనే చేపడతామని జవాబిచ్చారు. సమస్యల పరిష్కారానికి సమావేశం చక్కటి వేదిక కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు రమాదేవి, మహబూబ్ బాషా, డాక్టర్ మాధురి, జయచంద్రబాబు, విజయలక్ష్మి, సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబీకులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



వెంకటసుబ్బారెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

**దువ్వూరు :** మండలంలోని బుక్కాయపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పుత్తా వెంకటసుబ్బారెడ్డి శుక్రవారం రాత్రి అనారోగ్యంతో హైదరాబాద్ ఆస్పత్రిలో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి బుక్కాయపల్లెలోని శనివారంమృతుడి స్వగృహానికి వెళ్లి వెంకటసుబ్బారెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి, గోపిరెడ్డి బాబు, పుత్తా శ్రీనివాసులురెడ్డి, సుబ్బారెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి, నీలానందరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

### 90 శాతం పింఛన్ల పంపిణీ

**దువ్వూరు :** మండలంలో 90 శాతానికి పైగా పింఛన్లను శనివారం పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ రామకృష్ణయ్య తెలిపారు. మొత్తం 7,274 మందికి రూ.3,05,37,000 మంజూరవగా, ఉదయం 5.30 గంటల నుంచి మండలంలో 113 మంది సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము పంపిణీ చేశారన్నారు. ఒకటో తేదీ ఆదివారం కావడంతో శనివారమే 7,090 మందికి అందించగలిగామన్నారు.

### నేడు రెడ్ల కల్యాణ మండప వార్షికోత్సవం

**ప్రొద్దుటూరు :** పట్టణంలోని పెన్నానదీ తీరంలో నిర్మించిన రెడ్ల కల్యాణమండపం వార్షికోత్సవాన్ని ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించనున్నట్లు రెడ్ల సేవా సంఘం ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ఎమ్మెల్యేలు నంద్యాల వరదరాజులరెడ్డి, చదిపిరాళ్ల ఆదినారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా దాతలు సన్మానం, పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ ఉంటుందన్నారు.

### పేదలకు ప్రభుత్వ భూములు పంపిణీ చేయాలి

**కాశినాయన :** పేదలకు ప్రభుత్వ భూములు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శివకుమార్, మనోహర్, కమిటీ సభ్యులు అన్వేష్ డిమాండ్ చేశారు. నరసాపురం లోని సీపీఎం పార్టీ మండల ద్వితీయ మహాసభ శనివారం నిర్వహించారు. ముందుగా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్కెంగుండ్ల, సావిశెట్టిపల్లె, నాయునిపల్లె రెవెన్యూ గ్రామాల్లో వేల ఎకరాల ప్రభుత్వ భూములున్నాయని, ఆ భూములు పేదలకు పంచిపెట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఎం నూతన కమిటీ కన్వీనర్‌గా పోలయ్య, కమిటీ సభ్యులుగా బాబు, నరసింహులు, శ్రీనివాసులును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

**పోరుమామిళ్ల :** విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కొండారెడ్డి విద్యార్థులను హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ శామ్యూల్ డేవిడ్‌రాజు అధ్యక్షతన జరిగిన అవగాహన సమావేశంలో ఎస్ఐ కొండారెడ్డి మాట్లాడుతూ ఫేక్ యాప్స్, సైట్ల పట్ల అవగాహన ఉండాలన్నారు. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ ఫార్వర్డ్ చేయరాదన్నారు. శామ్యూల్ డేవిడ్‌రాజు మాట్లాడుతూ సోషల్ నెట్‌వర్క్ నేరాలపై యువతకు అవగాహన అవసరమన్నారు.

### వరి కోతలు వాయిదా వేయండి

**మైదుకూరు :** ఫెంగల్ తుపాను కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి కోతలను రైతులు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.లక్ష్మీప్రసన్న ఓ ప్రకటనలో సూచించారు. ఎవరైనా ఇప్పటికే కోసి ఉంటే టార్పాలిన్ పట్టతో కప్పి ఉంచాలని, పొలంలో నిలబడిన నీటిని వెంటనే పొలం నుంచి బయటికి పంపించాలన్నారు. వర్షానికి తడిసి మొలకలు రాకుండా ఉండాలంటే ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని తెలిపారు. తుపాను తర్వాత తెగుళ్లు సంభవించకుండా ట్రైసైక్లోజోల్ రెండు గ్రాముల మందు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. రైతులు 1బీ అడంగల్, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డుతో సమీపంలోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకులను సంప్రదించి పంట బీమా చేయించుకోవాలని సూచించారు. జొన్న, పెసర, నువ్వులు, బుడ్డ శనగ, వేరుశనగ, పొద్దుతిరుగుడు పంటలకు డిసెంబర్ 15, వరి పంటకు డిసెంబర్ 31వ తేదీ వరకు పంట గడువుందని వివరించారు.

### చట్టాలపై అవగాహన ఉండాలి

**గోపవరం :** దళిత, గిరిజనుల చట్టాలు, వారికి అందించే పథకాలు వివరాలపై అందరికీ అవగాహన ఉండాలని దళిత, గిరిజనుల ఎంపవర్‌మెంట్ చైర్మన్ మునెయ్య, అంబేడ్కర్ మిషన్ కన్వీనర్ ఓబులేసు, మాల మహాసేన రాష్ట్ర కార్యదర్శి మీసాల రవి అన్నారు. మండలంలోని పి.పి.కుంటలో శనివారం దళిత, గిరిజనుల చట్టాలపై శనివారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు ఉన్నా నిర్భయంగా చెప్పుకోవచ్చని గిరిజనులకు వారు సూచించారు. అనంతరం గిరిజనులు వారి సమస్యలను ఎంపవర్‌మెంట్ కమిటీ దృష్టికి తీసుకు వచ్చారు.

## అమ్మవారి శాలలో కార్తిక దీపోత్సవం



అర్ధనారీశ్వరుని చిత్రం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు



మదనగోపాల స్వామి ఆలయంలో కార్తిక పూజలు చేస్తున్న భక్తులు

**మైదుకూరు :** పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం రాత్రి కార్తిక దీపోత్సవం నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు అర్ధనారీశ్వరుడి చిత్రంతోపాటు రంగవల్లులు తీర్చిదిద్దారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం దీపాలను వెలిగించి మహా శివుడికి ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు.

**రాజుపాళెం :** మండలంలోని టంగుటూరులో వెలసిన మదన గోపాల స్వామి ఆలయంలో శనివారం కార్తిక దీపోత్సవం నిర్వహించారు. అర్చకుడు విజయ వర్ధన్‌రావు ఆధ్వర్యంలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేశారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద ఆకాశదీపం వెలిగించారు. రాత్రి భక్తులు భజన కార్యక్రమాలు నిర్వహించారు.

## ప్రొటోకాల్ విషయంలో నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి


**బద్వేలు అర్బన్ :** ప్రొటోకాల్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా సంబంధిత ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో శనివారం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ బద్వేల్ పురపాలక సంఘం ఎక్స్ అఫిషియో సభ్యురాలు, నియోజకవర్గ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి సమావేశం వివరాలు తెలపకపోవడంతో అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం ప్రజాప్రతినిధులను సమావేశానికి ఆహ్వానించాలన్నారు. కమిషనర్ స్పందిస్తూ ఇకపై తప్పనిసరిగా సమాచారం అందిస్తామని తెలిపారు.

బద్వేల్ పట్టణాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని చైర్మన్ పేర్కొన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బద్వేలు మున్సిపాలిటీకి మంజూరు చేసిన రూ.130 కోట్ల నిధులలో 50 శాతం మేర పనులు పూర్తి చేయగలిగామని, మిగిలిన పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

**సమస్యలపై గళమెత్తిన కౌన్సిలర్లు**

తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వార్డు కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకుపోయారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని వ్యాపార సముదాయల ఎదుట, డ్రైనేజీలపై ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను తొలగించిన మున్సిపల్ అధికారులు అదే ప్రాంతంలోని సెంట్రల్ లైటింగ్ స్తంభాలపై ఫ్లెక్సీలను ఎందుకు తొలగించడం లేదని 32వ వార్డు కౌన్సిలర్ బండి చెన్నయ్య ప్రశ్నించారు. పారిశుద్ధ్య పనులు ప్రధాన రహదారులకే పరిమితం చేయకుండా అన్ని వీధుల్లో చేపట్టాలని 13వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ హుస్సేన్ కోరారు. ఎన్‌జీవోకాలనీలోని ప్రభుత్వ స్థలంలో పార్క్ ఏర్పాటుచేయాలని 22వ వార్డు కౌన్సిలర్ ప్రఫుల్లారెడ్డి కోరారు. వీటికి కమిషనర్ స్పందించి పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం అజెండాలోని వివిధ అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్.వి.సాయికృష్ణ, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల సమస్యలపై వినతి



డిప్యూటీ తహసీల్దారుకు వినతి ప్రతం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, తదితరులు

**ప్రొద్దుటూరు :** పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి మండల డిప్యూటీ తహసీల్దారు సాయినాథరెడ్డికి శనివారం వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు సమయానికి సరకులు రావడం లేదని, మొబైల్ వాహనదారులు సక్రమంగా అందించడం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు భోగా శివకళ్యాణి, కల్పన, కృష్ణవేణి, స్వప్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

### 14న లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ

**బద్వేలు అర్బన్ :** డిసెంబరు 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయ వంతం చేసేందుకు న్యాయవాదులు కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రి పేర్కొన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు, వివిధ బ్యాంకు మేనేజర్లతో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కక్షిదారుల్లో అవగాహన పెంపొందించి ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, రాజీ పడటానికి అవకాశమున్న కేసులు పరిష్కరించు కునేందుకు లోక్ అదాలత్ మంచి వేదిక అన్నారు. కక్షిదారులు విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా కేసుల్లో రాజీపడి ప్రశాంత జీవనం సాగించాలని కోరారు. సమావేశంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

## వృత్తి విద్యా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

**బద్వేలు అర్బన్:** విద్యార్థి దశలోనే వృత్తి విద్యా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జెడ్పీ బాలురోన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు డీఎం.కరీముల్లా అన్నారు. ఇండస్ట్రీయల్ విజిట్‌లో భాగంగా విద్యార్థులతో కలిసి శనివారం ఉప విద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది విద్యార్థులకు ఇలాంటి అవగాహనా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అనంతరం ఏఈ చిన్నయ్య విద్యుత్ ఉప కేంద్రాల పనితీరు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సుభాష్‌చంద్రారెడ్డి, శివప్రసాద్‌రావు, రామచంద్రారెడ్డి, రవీంద్రారెడ్డి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

**కాశినాయన :** మండలంలోని నరసాపురం మోడల్ స్కూల్ విద్యార్థులకు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ ఇంద్రాణి శనివారం నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యా జ్యోతి పథకం కింద నరసాపురంలోని మోడల్ పాఠశాలలో 7, 8, 9వ తరగతుల్లో ప్రతిభ కనబరిచిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు.. ఒక్కొక్కరికి రూ.5 వేల నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నామన్నారు. ఆ నగదును వారి విద్యా ఖర్చులకు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుమలరాజు, ఝాన్సీ లక్ష్మి, అనిత, రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.